# మూల స్తంభాలు



**న**గరంలో కొత్తగా వచ్చిన ఎస్సయ్ దేవేందర్‌కి పరిస్థితి గంగరగోళంగా కనిపించింది. నడిరోడ్డులో ఉన్న విగ్రహాలు అదృశ్యమైపోతున్నాయ్. నాలుగు రోడ్ల జంక్షన్‌లో ఉన్న నిలువెత్తు 'అంబేద్కర్' విగ్రహం రెండు నెలల క్రితం రాత్రికి రాత్రి అదృశ్యమైపోయింది. ఇది దళితుల మీద అగ్రవర్ణాల దాడా? వేరేమతాల వాళ్ళెవరయినా చేసారా! విగ్రహం ఆచూకి అంతుచిక్కలేదు. అసలు దీన్నెలా, ఎప్పుడు తొలిగించగలిగారో ఎవరి బుర్రలకీ అందలేదు. ఎందుకో కాని ఎవరు చేసారో తెలియదు. జనం మరిచారు. పోలీసులూ మరిచారు 'విగ్రహమేకదా' అని!

అంతలోనే గాంధీజీ, 'ఎన్టీఆర్' విగ్రహాలు మాయమయ్యాయి. ఇది అధికార, ప్రతిపక్ష పార్టీల పరస్పర వైషమ్యాల ప్రతిఫలమేమో అనుకున్నారు. ఇరు పక్షాల వాళ్ళూ ఒకరిమీద ఒకరు బురద జల్లుకున్నారు. మాటలు విసురుకున్నారు. రాళ్ళూ రువ్వుకుంటూండగా పోలీసులు 144 విధించారు.

పోనీ విగ్రహాలు కాంస్యంతోనో, ఇంకేలోహంతోనో చేసేవైతే ఎవరో అమ్ముకోడానికి తీసుకుని పోయారనుకోటానికి, కానీ సిమ్మెంట్‌తో చేసిన వాయె!

దేవేందర్ గట్టి నిఘావేసాడు ఇంతలో వీధి లైట్లు పగలిపోవటం ప్రారంభమైంది.

నగరంలో చాలా రోడ్లు చీకటి!

మొదట్లో అంతగా పట్టించుకోలేదు.

రాను, రాను వీధిలైట్లు లేకుండా చేసేస్తున్నారు. ఇది ఎవరి పనో అర్థం కాలేదు.

ఓ రోజు రాత్రిపోలీసులు చూస్తుండగానే కొం దరు వ్యక్తులు రాళ్ళతో ట్యూబ్ లైట్లను పగ లగొట్టేసారు. మొత్తం ఈ చివరి నుంచి ఆ చివరి వరకూ వరుసగా లైట్లు పేలిపోయిన శబ్దాలు!

పోలీసులు ఈలలు!

దుండగుల పరుగులు. బూట్లకు బదులు చెప్పులేసుకుని డ్యూటీ చేస్తోన్న పోలీసుల కాళ్ళలో గాజు పెంకులు, ఫలితంగా రక్తాలు!

ఈ చీకట్లో పాట్టి శ్రీరాములు శిలా విగ్రహాన్ని పెకలిస్తోన్న నలుగురు వ్యక్తులు పోలీసుల చేతికి చిక్కారు. వాళ్ళు వీరప్పన్‌ని పట్టుకున్నంత సంబరపడిపోయి, పోలీస్ స్టేషన్‌కి తీసుకెళ్ళారు.

అంతలోనే మరోవింత!

ఓ సందులో వీధిలైట్లను రాళ్ళతో కొట్టడానికి కేటిల్ బార్‌తో గురిచూస్తోన్న బృందం కనిపించింది. పోలీసులు జాగర్తగా ఉంచకున్న తాడుతో వాళ్ళని వలవన్ని పట్టుకున్నారు. కట్టేసారు.

ఆశ్చర్యం!

వాళ్ళు తప్పించుకోకుండా నిలబడేవున్నారు. ఎస్సయ్‌కి గొప్ప ఆనందంగా ఉంది. రెండు పిట్టలూ ఒకే దెబ్బకి! వేధిస్తోన్న సమస్య పరిష్కారానికి వచ్చేసింది.

వాళ్ళని సెల్‌లో పెట్టేసారు.

తెల్లారి హెడ్‌కానిస్టేబుల్ వెంకటస్వామి మరో ఇద్దరు పోలీసులు విగ్రహాలు దాచేస్తున్న వారిని లాక్కొచ్చారు ఎస్.ఐ. దగ్గరికి.

"ఎన్నాళ్ళ బట్టి ఇలా విగ్రహాలను మాయం చేస్తున్నారు?" అడిగాడు ఎస్సయ్.

"చాలా కాలం బట్టి మాకిదే పనండీ"

తడుముకోకుండా చెప్పాడొకడు.

"ఏం ధైర్యంరామీది? అవి మీకేం చేసాయని?"

"అవిమాకేటి సెయ్య నేదండీ?" ఆల్లు మానుబావులాండీ? ఈ మధ్యనో రోజు ఎండలో వత్తన్నానండీ. వత్తంటే సెమటతో వొల్లంతా తడిసి ముద్దయిపోందండి. ఈడికేమో బట్టతల గదండీ నెత్తిమాడి పోనాదండీ!

మరొక రోజేటయిందంటే..

"వోనంటే వోన కాదండీ.... బాగా తడిసి పోనామండీ.... ఈ రాత్రి జొరవెుచ్చేసి నాదండీ...."

అప్పుడు మావోడన్నదాకా నాకుతోసనే దండీ....

"ఈ యంబేద్కర్ గోరికి.." గాంధీగోరికి... మీదనో గొడుగైనా నేదు కదండీ... ఈల్లు వోనకి తడిసిపోయి, ఎండకి మాడిపోయి ఎలగుంతన్నూ అని డౌటొచ్చేసినాదండీ....

"ఓరోజు అంబేద్కర్‌గోరి తలమీద కాకి రెట్టేసేసి నాదండీ.... గాంధీ గోరి బొమ్మకి కాలుదన్నిట్టే ఒక కుక్క ఒంటేలు పొసెస్తన్నదండి....

రామ... రామ.... ఎంతగాచ్చారం జరిగిపోతంది? పగలయితే ఈ పాడు జనం ఒప్పుకోరని... అల్లకి రచ్చన కల్పించాలని అవిడియాకొచ్చేసి. ఆలనక్కణ్ణించి సోటుమార్చేసి దాసేసినామండీ... అదండీ కత!"

"మీ యమ్మాకడుపు మాడ. మీకేం పిచ్చా? విగ్రహాలకు ఎండా, వానా ఏంట్రా?"

బల్బ్‌లు పగలగొట్టిన వాళ్లని ఆరా తీసాడు యస్.ఐ.

"ఒరేయ్! ఎంతకాలంగా ఈ పని చేస్తున్నార్రా?"

"అదేటండీ! సంవచ్చరమైపోతోందీ ఊరొచ్చి"

"అంటే మీదీ ఊరుకాదా?"

"కాదండీ... ఊరూరు తిరిగి లైట్లు పగలగొడతున్నామండీ!"

"మీకిదేం పోయేకాలంరా!"

"అట్టాగంత రేటండీ? అర్ధరాత్రి ఎవలూ లేని సోట్ల ఆ నైట్లెందుకండీ? కరెంటు దండగ. ఈ గవర్నిమెంటుకు ఈ మాత్రం తేలీదేంటండి!

"వొవులుక్కావాలంతే ఆల్లే బేటర్లైటే సుకుని తిరుగుతారు. ఇక కార్లకి ఎట్టాగూ నైట్లుంటన్నాయి. ఇంతలేని కరెంట్లు దండగెట్టేసి... సార్జీలు పెంచీడమెందకండీ?

ఇలాగ పెతీ ఊళ్ళో రాత్రి దీపాల్తీసేసినామను కోండి.... ఎంత కరెంటు మిగుల్తాదో ఆలోసించండి. ఉప్పుడు సెప్పండి. మాత్తప్పం టారా?'' అని వాడెదురు ప్రశ్న వేసేసరికి ఎస్సయికి పిచ్చెక్కినంత పనయింది.

''య్యా....!'' అంటూ గంతులేసాడు. టోపీ మీద లాఠీతో కొట్టుకుని.

ఇంతలో ఓ పదిమంది నలుగురు పోలీసులని చేతులూ కాళ్ళూ కట్టేసి తీసుకొచ్చి ఎస్సయి ముందు పడేసారు.

''ఏ.... ఏంటి? ఏమయింది? ఎందుకిలా వీళ్ళని కట్టేసారూ?'' చెమటెక్కిపోతూ అడిగాడు ఎస్సయి.

''సిగ్నల్ దగ్గర డ్యూటీ సెయ్యమనే కదా మీరు సెప్పారు. ఈళ్ళూ అడ్డగ నిలబడి అల్లకి నచ్చినకాసి చేయూపు తన్నారు ఈనోగా ట్రాఫిక్క్ జామ్ అయిపోయి గంటయినా ఎవళ్ళూ పట్టించుకోనేదండి. ఈళ్లని కట్టిపడేసి వేంవేం పట్టుకొచ్చేసినాం. ఏం చేస్తారో సెయ్యండి.'' అని చెప్పి వాళ్లు వెళ్లిపోయారు.

''వెంకటసామీ! నీళ్లు పట్రా'' - ఎస్.ఐ

వెంకటస్వామి కుండతో నీళ్ళు పట్టుకొచ్చాడు. ఎస్సయి దేవేందర్ కుండను ఎత్తిపట్టుకొని కడుపునిండా నీళ్ళుతాగి, బుర్ర మీద నుండి పోసుకోబోతుంటే ''ఆగండి సార్! టోపీతీస్తా''నని వెంకటస్వామి టోపీ తీసాడు.

ఎస్సయి బుర్రమీంచి నీళ్ళు దిమ్మరించు కున్నాడు.

''ఇప్పుడు చెప్పుస్వామీ!నాకేం అర్థం కావట్లేదు వీళ్ళ సంగతి? వీళ్ళు పిచ్చోళ్ళా? మూర్ఖులా? వాళ్ళేమో విగ్రహాలు పెకలించేసి... కారణం అలా చెపుతున్నారు. వీళ్ళేమో వీధిలైట్లు పగలగొట్టేసి కారణం ఇలా చెపు తున్నారు. ఇంతలోనే వీళ్ళు ట్రాఫిక్ పోలీస్లల్ని కట్టిపడేసి తెచ్చి అలా వెళ్ళిపోయారు!

వీళ్ళనేం చేయాలో నాకర్థం కావటం లేదు. చెప్పు. స్వామీ! వీళ్ళ సంగతి?''

''ఏం చెప్తామండీ. ఆళ్ళే ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలండి. ఎన్ని ఆటు పోట్లొచ్చినా... భారతదేంలో ప్రజాస్వామ్యం బట్టకట్టి నిలబడ్డాదంటే ఈళ్ళ వల్లనేనండీ!''

''ఇదిగో స్వామీ! నా బుర్రిప్పటికే పిచ్చెక్కిపోయి ఉంది. సరైన సమాధానం చెప్పక పోయావో... అందర్నీ కరిచెస్తాను రేయ్!'' అన్నాడు టోపీ తీసి. టక్కు ఊడదీసేసి.... ఈళ్లందర్ని లోపలకుతోసి, కేసులు రిజిస్టర్ చెసెయ్'' అన్నాడు.

''అయ్యా! మీరు శాంతించండి.

వాళ్లు చేసిందాట్లో ఓ నిజాయితీ ఉంది....''

''అదేంటయ్యా స్వామి!'' - ఎస్.ఐ

''అవును సార్!''

''విగ్రహాలు ఆర్భాటంగా పెట్టినప్పుడు వాటి సంగతి అప్పుడప్పుడు పట్టించుకోవాలి కదా. వాటి మీద కాకులు, పిట్టలు రెట్టలు వేసినా విగ్రహాలు అసహ్యంగా కనిపిస్తున్నా చూస్తూ ఉంటారె తప్ప ఆ పెద్దల మీద ఉన్న గౌరవం గుర్తుంచుకుని వాటి ఆలనాపాలన చూడద్దా!''

''నిజానికి వీధిలైట్లకు టైమూపాడు లేదు వగళ్ళుసైతం దేదివ్యమానంగా వెలిగి పోతున్నాయి. వృధాగా వెలుగుతున్నా యనిపించింది వీళ్ళకు, కరెంటు ఎంతో ఆదా అవుతుందన్న తపన తప్పించి తప్పు చేసా మన్నంతగా వాళ్లు ఆలోచించ రండయ్యా!

వీళ్లందర్నిలోపలేసి కేసులు పెట్టి మననెత్తి మీద కూర్చోబెట్టుకోవడం తిండి దండగసార్. వదిలేసి ఉండడమే మంచిది.'' వెంకటస్వామి సుదీర్ఘ ఉపన్యాసం చేసాడు. ''సరే ఏదా ఒకటి చేసి ముందువీళ్లని నా కుకనిపించ కుండ చెయ్యి'' అని విసుకున్నాడు యస్.ఐ దేవేందర్.

(కేవలం వ్యంగ్య రచన)